క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



నర్సంపేట : నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన 13 బీఆర్‌ఎస్‌ కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో ఆదివారం చేరాయి. ఈ సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో బూస కుమార స్వామి, తదితరులు పార్టీలో చేరగా వారికి స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నల్లబెల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు బత్తిని మహేశ్‌, నాయకులు కొండి అశోక్‌, మాసంపెల్లి అఖిల్‌, పరికి పవన్‌, నవీన్‌, దండు సునీల్‌, కిశోర్‌, సుమన్‌, పవన్‌, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ స్ఫూర్తిప్రదాత



ఖానాపురం : డాక్టర్‌ బీఆర్‌.అంబేడ్కర్‌ను స్ఫూర్తిప్రదాతగా ఎస్సై రఘుపతి అభివర్ణించారు. మండలంలోని బుధరావుపేటలో అంబేడ్కర్‌ విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో విగ్రహ నిర్మాణ పనులకు ఆదివారం ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. యువత అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని జీవితంలో రాణించాలని సూచించారు. అంబేడ్కర్‌ విగ్రహ ఏర్పాటు అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో నిర్మాణ కమిటీ సభ్యులు సురేశ్‌, శ్రీనివాస్‌, యాకయ్య, హరీశ్‌, అశోక్‌, నగేశ్‌, రమేశ్‌, హసన్‌, సాయి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



పర్వతగిరి : మండలంలోని వడ్లకొండకు చెందిన కాంగ్రెస్‌ పార్టీ సోషల్‌ మీడియా కన్వీనర్‌ కట్ల శ్రీనివాస్‌ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబానికి పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌ నాయక్‌, శ్రేణులు సమీకరించిన రూ.31 వేల నగదును ఆదివారం అందజేశారు. శ్రీనివాస్‌ మృతి పార్టీకి తీరని లోటన్నారు. శ్రీనివాస్‌ కుటుంబానికి పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటాయని తెలిపారు. శ్రీనివాస్‌ పిల్లలకు ఆర్డీఎఫ్‌ సహకారంతో ఉచిత విద్య అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు బాల్లె రాజు, కుసం రాంచందర్‌, నాయకులు అత్తి కుమార స్వామి, తొర్రి పద్మ కుమార్‌, రంగయ్య, కొమ్ము రమేశ్‌, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నర్సంపేట రూరల్‌ : నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లి సీపీఎం శాఖ కార్యదర్శి మాంకాల శ్రీనివాస్‌ మృతి చెందగా ఆయన మృతదేహానికి ఆ పార్టీ నాయకులు భూక్యా సమ్మయ్య, కోరబోయిన కుమారస్వామి, నమిండ్ల స్వామి, హనుమకొండ శ్రీధర్‌, మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్‌, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, తదతరులు ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మంజుల, సాయిలు, అనంతగిరి రవి, కడియాల మనోహర్‌, మలహల్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, గడ్డమీది బాలకృష్ణ, బొడిగె సమ్మయ్య, తదితరులున్నారు.

రాజపల్లిలో..



నర్సంపేట రూరల్‌ : నర్సంపేట మండలంలోని రాజపల్లికి చెందిన కార్మిక నాయకుడు పొన్నం శ్యాంసుందర్‌ మృతి చెందగా ఆయన మృతదేహానికి తెలంగాణ రాష్ట్ర రెడ్డి పరపతి సంఘం అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి, మెపా రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్‌, తదితరులు నివాళులర్పించారు. కార్మిక నాయకుడిగా శ్యాంసుందర్‌ అందించిన సేవలను గుర్తు చేశారు. శ్యాంసుందర్‌ మృతి తీరని లోటన్నారు. కార్యక్రమంలో నాయకులు చొప్పరి లక్ష్మీనర్సు, పొన్నం రమేశ్‌, గుండు సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

విద్యారణ్యపురి : ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన ఉండాలని సఖి లీగల్‌ కౌన్సెలర్‌ శ్రీదేవి అన్నారు. సఖి వన్‌స్టాప్‌ సెంటర్‌, సర్వోదయ యూత్‌ ఆర్గనైజేషన్‌, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో హనుమాన్‌నగర్‌లో మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడారు. సఖి కేంద్రం ద్వారా బాధిత మహిళలు, బాలికలకు 5 రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సఖి కేస్‌ వర్కర్‌ అనూష, తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట.. మేలైన ప్రత్యామ్నాయం

- పూత దశలో దుక్కిలో కలియదున్నితే సేంద్రియ ఎరువు
- తగ్గుతున్న రసాయన ఎరువుల ఖర్చు

సంగెం : భూమికి కావాల్సిన పోషకాలు అందించడంలో రసాయనిక ఎరువులకు పచ్చిరొట్ట మేలైన ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది. మండలానికి చెందిన పలువురు రైతులు రసాయనిక ఎరువులకు బదులు పచ్చిరొట్టను ఎంచుకుంటున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచన మేరకు పంటల సాగుకు ముందుగా పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ చల్లి పూత దశకు చేరుకున్న తర్వాత కేజీ వీల్స్‌ ట్రాక్టర్‌తో కలియదున్నితే సేంద్రియ ఎరువు తయారవుతోంది. తద్వారా దాదాపు ఎకరాకు రూ.4–5 వేల మేర రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గించుకుంటున్నారు.

సేంద్రియ ఎరువుల కొరత

వరి సాగుకు పోషకాలు అందించేందుకు పశువులు, గేదెలు, కోళ్ల ఎరువు వాడాల్సి ఉంటుంది. ప్రపంచం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న ప్రస్తుత తరుణంలో దశాబ్దాల కింద నాటి పరిస్థితులు పల్లెల్లో లేవు. పాడి పశువులు, ఆవులు, కాడెడ్లు ఇంటింటికీ లేకపోవడం ఇందుకు ఉదాహరణగా చెప్పొచ్చు. ఈ క్రమంలో పలువురు రైతులు కోళ్ల, గొర్రెల, ఇతర పశువుల ఎరువుపై ఆధారపడుతున్నారు. కోళ్ల ఎరువు ధర ట్రాక్టర్‌కు రూ.6 వేలు, పశువుల ఎరువు రూ.5 వేలకుపైగా పలుకుతోంది. గొర్రెల మంద పెడితే రోజుకు రూ.2 వేలు ఇవ్వాల్సిందే. అలా చెల్లిద్దామన్నా రైతులందరికీ సరిపడా లభ్యం కావడం లేదు. ఈ క్రమంలో పంట ఆదాయం కంటే పెట్టుబడి ఎక్కువగా ఉంటోంది. దీంతో ఖర్చు తాళలేక మండలానికి చెందిన పలువురు రైతులు సేంద్రియ ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించారు.



గవిచర్లలో ఏపుగా పెరిగిన జీలుగ

పట్టరొట్ట పైర్లతో భూసారం పెంపు

తక్కువ ఖర్చుతో అనతికాలంలోనే భూమిలో ఉండే పంటలకు ఎరువుగా ఉపయోగపడే పచ్చిరొట్ట పంటలైన జనుము, జీలుగ, పిల్లి పెసర వేసే దిశగా మండల రైతులు దృష్టి సారించారు. ఈ విత్తనాలు సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేస్తుండంతో రైతులు మరింతగా ఆసక్తి చూపుతున్నారు. తొలకరి వర్షాలు పడగానే జూన్‌ మొదటి వారంలో పచ్చిరొట్ట విత్తనాలు వేసిన రైతులు, ప్రస్తుతం పూత దశలో ఉన్న జనుము, జీలుగను పొలంలోనే కేజీ వీల్స్‌తో దున్నేస్తున్నారు. దున్నిన తర్వాత ఎకరాకు 25 కేజీల చొప్పున సింగిల్‌ సూపర్‌ ఫాస్ఫేట్‌ వేస్తే నీటిలో కలిసిపోతుంది. అనంతరం మరోసారి ట్రాక్టర్‌తో దున్ని నాట్లు వేస్తున్నారు.

ఎరువుల ఖర్చు తగ్గుతుండడంతో ఆసక్తి

పచ్చిరొట్ట పంటలతో ఎకరాకు 8–9 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. భూసారం పెరగడంతో పాటు ప్రధాన పోషకాలైన నత్రజని అధికంగా, భాస్వరం, పొటాషియం మోస్తరుగా అందుతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పచ్చిరొట్ట వేసిన భూమిలో రైతులు రసాయన ఎరువులను తక్కువ మోతాదులో వినియోగిస్తున్నారు. చేను ఏపుగా పెరుగుతుండడంతో కొందరు రైతులు ఎరువుల వినియోగాన్ని మానేస్తున్నారు. పచ్చిరొట్టలో ఉండే ఎంజైములు మట్టిలో లభ్యం కాని స్థితిలో భాస్వరం, కాల్షియం, మెగ్నీషియం, జింక్‌, ఇనుము మొదలైన పోషకాలతో దిగుబడి గణనీయంగా పెరుగుతుందని పరిశోధనలు తేల్చాయి.

ఎరువుల ఖర్చు తగ్గుతోంది



వరి సాగుకు ముందు ఏటా జీలుగ సాగు చేస్తున్నా. మూడు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. జీలుగను పూత దశలో కలియదున్నించడం ద్వారా సేంద్రియ ఎరువుగా తయారవుతోంది. వ్యవసాయ అధికారులు సూచించినంత కంటే తక్కువ మోతాదులో రసాయనిక ఎరువులు వాడుతున్నా పంట దిగుబడి బాగుంటోంది. జీలుగ సాగుతో భూసారం పెరుగుతోంది.

– పెద్దపెల్లి రాజ్‌కుమార్‌, రైతు, నర్సానగర్‌

పూత దశలో కలియదున్నాలి



వరి పండించే భూముల్లో రైతులు ఎక్కువగా పచ్చిరొట్ట సాగు చేయడం శుభ పరిణామం. జీలుగ, జనుము, పిల్లి పెసర, పెసర వంటి పంటలను పూత దశకు వచ్చిన తర్వాత భూమిలో కలియదున్నాలి. తద్వారా వల్ల పచ్చిరొట్ట సేంద్రియ ఎరువుగా మారి భూసారం మరింతగా పెరుగుతుంది. నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం సైతం పెరుగుతుంది. పెట్టుబడి తగ్గుతుంది.

– యాకయ్య, మండల వ్యవసాయ అధికారి

కార్యకర్తలను వేధిస్తే గుణపాఠం తప్పదు



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మారెడ్డి

- పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

గీసుకొండ : పరకాల నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్‌ శ్రేణులను వేధిస్తే గుణపాఠం తప్పదని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని ఊకల్‌ క్రాస్‌ రోడ్డు సమీపంలోని ఎస్‌ఎస్‌ గార్డెన్స్‌లో గీసుకొండ, సంగెం మండలాల బీఆర్‌ఎస్‌ నాయకులు, క్రియాశీల కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ నాయకులను కొందరు కాంగ్రెస్‌ నాయకులు పలు రకాలుగా వేధింపులకు గురి చేస్తున్నారని, అలాంటి వారికి బీఆర్‌ఎస్‌ అధికారంలోకి వచ్చాక గోరీ కడతామని హెచ్చరించారు. గతంలో బీఆర్‌ఎస్‌లో పదవులను అనుభవించి స్వప్రయోజనాలే లక్ష్యంగా పార్టీ మారిన నాయకులు కాళ్లు మొక్కినా వారిని మళ్లీ బీఆర్‌ఎస్‌లోకి తీసుకునే ప్రసక్తే లేదని తేటతెల్లం చేశారు. సంగెం మండలంలో రైతులు యూరియా కావాలని అడిగితే అక్రమంగా కేసులు బనాయించారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి, ఎస్‌ఐకి సిగ్గుందా? అన్నారు. గ్రామాల్లో చెత్త సేకరణకు ఉపయోగించే ట్రాక్టర్లలో డీజిల్‌ పోసేందుకు డబ్బులు లేవని అధికారులు చెబుతుండడం కాంగ్రెస్‌ అసమర్థ పాలనకు అద్దం పడుతోందని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ నాయకుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. హామీల అమలులో కాంగ్రెస్‌ విఫలమైందని చెప్పారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీలు పోలీసు ధర్మారావు, సుదర్శన్‌రెడ్డి, 15వ డివిజన్‌ కార్పొరేటర్‌ మనోహర్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ కొల్లూరి రవీందర్‌, మాజీ సర్పంచ్‌లు బోడకుంట్ల ప్రకాశ్‌, పూండ్రు జయపాల్‌రెడ్డి, అంకతి నాగేశ్వర్‌రావు, నాయకులు సారంగపాణి, సుంకరి శివ, సిరిసె శ్రీకాంత్‌, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, చల్లా వేణుగోపాల్‌రెడ్డి, రఘుపతి, గోలి రాజయ్య, ముంత రాజయ్య, కోట ప్రమోద్‌, ధనుంజయ, దొనికెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- జెడ్పీ మాజీ వైస్‌ చైర్మన్‌ శ్రీనివాస్‌

దుగ్గొండి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని జెడ్పీ మాజీ వైస్‌ చైర్మన్‌ ఆకుల శ్రీనివాస్‌ కోరారు. మండలంలోని నాచినపల్లి ఎంపీటీసీ పరిధిలో బీఆర్‌ఎస్‌ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జంగా రంగారెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సభకు శ్రీనివాస్‌ అతిథిగా హాజరై మాట్లాడారు. స్వరాష్ట్ర సాధన కోసం ఉద్యమం జరిగిన నాటి నుంచి గ్రామం బీఆర్‌ఎస్‌కు అండగా ఉంటోందని చెప్పారు. పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో 10 ఏళ్లు రైతులు సంతోషంగా వ్యవసాయం చేసుకున్నారని తెలిపారు. నాటి, ప్రస్తుత పరిస్థితులను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, నాయకులు పొన్నం మొగిలి, కాట్ల భద్రయ్య, శానబోయిన రాజ్‌కుమార్‌, పెండ్యాల రాజు, గుడిపెల్లి జైపాల్‌రెడ్డి, నాగరబోయిన మోహన్‌, జంగా రాజిరెడ్డి, నల్ల శ్యాంసుందర్‌రెడ్డి, గుండెబోయిన ఖాజీ యాదవ్‌, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌

ఎర్రబెల్లిపై విమర్శలు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి, మధుసూదన్‌

- బీఆర్‌ఎస్‌ మండల, పట్టణ అధ్యక్షులు కుమారస్వామి, మధుసూదన్‌

వర్ధన్నపేట : మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై స్థానిక ఎమ్మెల్యే నాగరాజు విమర్శలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్‌ మండల, పట్టణ కమిటీల అధ్యక్షులు తూళ్ల కుమారస్వామి, గోధుమల మధుసూదన్‌ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో చెక్‌డ్యాంలు తెగిపోతే ప్రస్తుత ఎమ్మెల్యే శాశ్వత మరమ్మతులు చేయించలేదని చెప్పారు. ఎస్సారెస్పీ కాల్వల నుంచి సాగు నీరు రాకపోవడంతో రైతులు 2 శాతం కూడా నాట్లు వేయలేదని తెలిపారు. సాగు నీరు మీద ఎమ్మెల్యే నాగరాజుకు కనీస అవగాహన లేదన్నారు. దయాకర్‌రావు కృషి ఫలితంగానే ఎస్సారెస్పీ కాల్వ మండలం నుంచి నిర్మితమయ్యిందని తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వం బాబ్లీ ప్రాజెక్టు కట్టి ఎస్సారెస్పీలోకి నీరు రాకుండా చేయగా దయాకర్‌రావు పోరాడారని, జైలు జీవితం గడిపారని చెప్పారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో ఎండా కాలంలోనూ అన్ని చెరువులు, కుంటలను దేవాదుల నీటితో నింపిన చరిత్ర దయాకర్‌రావు సొంతమన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు, మాజీ వైస్‌ ఎంపీపీ చొప్పరి సోమయ్య సోమలక్ష్మి, నాయకులు సుంకరి సాంబయ్య, పెంచల కుమారస్వామి, కొండేటి శ్రీనివాస్‌, వసంత నాయక్‌, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ సంఘం మండల కమిటీ ఎన్నిక



వర్ధన్నపేట : స్థానిక కమ్యూనిటీ హాలులో తెలంగాణ ముదిరాజ్‌ మహాసభ ఆధ్వర్యంలో ముదిరాజ్‌ సంఘం మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి, మత్స్య సెల్‌ చీఫ్‌ ప్రమోటర్‌ సోమయ్య కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా పిట్టల భాస్కర్‌, ప్రధాన కార్యదర్శిగా పొన్నం స్వామి, ఉపాధ్యక్షులుగా నారెల్లి సుధాకర్‌, యాదయ్య, అనిల్‌, సహాయ కార్యదర్శిగా శ్రీను, ఎల్లయ్య, ప్రచార కార్యదర్శిగా అల్లి చిన్న కొమురయ్య, కోశాధికారిగా ఇత్తబోయిన సోమయ్య, కార్యవర్గ సభ్యులుగా చొప్పరి కొమురయ్య, ఎల్లయ్య, భిక్షపతి ఎన్నికయ్యారు. కమిటీకి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఐ సెల్‌ రాష్ట్ర కన్వీనర్‌ శానబోయిన రాజ్‌కుమార్‌, ముదిరాజ్‌ యూత్‌ విభాగం జిల్లా అధ్యక్షులు పోలు అమర్‌చందర్‌, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన దివ్యాంగుడి మృతి



లోకేశ్‌ (ఫైల్‌)

నర్సంపేట : ఆత్మహత్యకు యత్నించిన దివ్యాంగుడు మృతి చెందిన సంఘటన చెన్నారావుపేట మండలంలోని జీడిగడ్డతండాలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక పోలీసు కథనం ప్రకారం.. జీడిగడ్డతండాకు చెందిన దివ్యాంగుడు గుగులోతు లోకేశ్‌ (22) ఈనెల 5న ప్రమాదానికి గురి కాగా ఎడమ కాలు విరిగింది. కుటుంబీకులు అతడికి చికిత్స చేయించి ఇంటికి తీసుకొచ్చారు. ఇప్పటికే వైకల్యంతో బాధపడుతుండగా ఎడమ కాలు విరిగిన నేపథ్యంలో తనకు తల్లిదండ్రులు సేవలు అందించడంలో ఇబ్బందిపడుతుండడంతో మనస్తాపానికి గురై ఈనెల 15న రాత్రి కుటుంబ సభ్యులు నిద్రలో ఉండగా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి లచ్చిరామ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై లక్ష్మణమూర్తి తెలిపారు.

రేపు సమావేశం

హన్మకొండ : రేపు (ఈనెల 22న) తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ రాష్ట్ర జనరల్‌ బాడీ మీటింగ్‌ నిర్వహిస్తామని అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి బక్క దానయ్య, ఉపాధ్యక్షుడు రౌతు రమేష్‌ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, మాజీ ప్రభుత్వ విప్‌ మోహన్‌ తదితరులు హాజరవుతారని వివరించారు.

పింఛన్‌ పెంపునకు ఉద్యమాలే శరణ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరావు

- ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్‌ ఆనందరావు

సంగెం : పింఛన్‌ పెంపునకు ఉద్యమాలే శరణ్యమని ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్‌ వంగూరి ఆనందరావు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పెన్షనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ పార్టీ దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వికలాంగులకు రూ.4 వేల చొప్పున పెన్షన్‌ ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. పెన్షన్‌ పెంపు సాధనే లక్ష్యంగా ఆగస్టు 13న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో పెన్షనర్ల మహాగర్జన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 29న వరంగల్‌లో నిర్వహించనున్న సన్నాహక సదస్సుకు మంద కృష్ణ హాజరవుతున్నారని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెన్షనర్లు సదస్సుకు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు, వృద్ధులకు, వితంతువులకు పింఛన్‌ పెంచాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో ఫెడరేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు సందె కార్తీక్‌, ఎంఆర్‌పీఎస్‌ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్‌, మండల ఇన్‌చార్జ్‌ మాసాని గోపాల్‌, మండల అధ్యక్షుడు కిశోర్‌, వీహెచ్‌పీఎస్‌ మండల అధ్యక్షుడు బాబు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి

- ఎస్సై రణధీర్‌రెడ్డి

దుగ్గొండి : శాంతిభద్రతల పరిరక్షణలో సహకరించాలని ఎస్సై రావుల రణధీర్‌రెడ్డి ప్రజలను కోరారు. మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పల్లెల్లో అపరిచితులు సంచరిస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. అనుమానితుల వివరాలు పోలీసులకు అందించాలని సూచించారు. సైబర్‌ నేరాలు, తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు, చైన్‌ స్నాచింగ్‌లపై వివరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ నేరాలకు అడ్డుకట్ట వేయడంలో తోడ్పాటు అందించాలని ఆకాంక్షించారు.



మాట్లాడుతున్న ఎస్సై రణధీర్‌రెడ్డి

ధర్మారెడ్డికి విమర్శించే హక్కు లేదు

- కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్‌

ఆత్మకూరు : కాంగ్రెస్‌ పార్టీని విమర్శించే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి లేదని కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్‌ అన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో ఆదివారం జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి గ్రామాల అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని అన్నారు. బీఆర్‌ఎస్‌ హయాంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజల చేతిలో గుణపాఠం తప్పదన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కాంగ్రెస్‌ పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బీఆర్‌ఎస్‌ పార్టీ విమర్శలు చేస్తుందని ఆరోపించారు. మాజీ జెడ్పీటీసీ రాధిక, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమలాపురం రమేశ్‌

సంఘాల బలోపేతానికి ప్రాధాన్యం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి

- సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్‌ తిరుపతి

రాయపర్తి : హక్కుల సాధన కోసం గీత కార్మిక సంఘాలను బలోపేతం చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలని గీత కార్మిక సంఘం ఉమ్మడి వరంగల్‌ జిల్లా కన్వీనర్‌ బైరి తిరుపతి కోరారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 80 ఏళ్లు కావస్తున్నా గీత కార్మిక కుటుంబాలు విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో వెనుకబడి ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వాలు మారినా గీత కార్మికుల సమస్యలు అపరిష్కృతంగానే ఉంటున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. సంఘాలను బలోపేతం చేసుకోవడం ద్వారా గీత కార్మికుల సంక్షేమ పథకాలు అందిపుచ్చుకోవాలని సూచించారు. గీత కార్మికులు ఆర్థికంగా, రాజకీయంగా మరింత ఎదగాలని ఆకాంక్షించారు. సొసైటీలకు గ్రామాల్లో పదెకరాల చొప్పున భూమి సాధించుకోవాలని, ఇతర హక్కులు పొందాలని కోరారు. స్కిల్‌ యూనివర్సిటీలో గౌడ కులస్తులకు వృత్తి నైపుణ్యం పెంపొందించేలా శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. తొలుత మండలంలోని గీత కార్మిక సంఘం భవిష్యత్‌ కార్యాచరణ, సన్నాహక కార్యక్రమాల గురించి చర్చించారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి చిర్ర శ్రీనివాస్‌ మండల బాద్యుడు కోతి క్రాంతి, హన్మకొండ జిల్లా కార్యదర్శి పల్లె రాజు, నాయకులు తేరాల సదానందం, దొనికెల సదానందం, రవి, చిర్ర సందీప్‌, పెద్దగోని అనిల్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్‌ మోహన్‌

- బీఆర్‌ఎస్‌ మండల కన్వీనర్‌ మోహన్‌

ఐనవోలు : అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్‌ పార్టీ మండల కన్వీనర్‌ తంపుల మోహన్‌, వర్కింగ్‌ ప్రసిడెంట్‌ తక్కళ్లపల్లి చందర్‌రావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఎంపీటీసీ స్థానాల సన్నాహక సమావేశాన్ని ముఖ్య నాయకులతో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. ప్రభుత్వ తప్పిదాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్‌లు మహ్మద్‌ ఉస్మాన్‌ అలీ, పల్లకొండ సురేష్‌, జయశంకర్‌, జగపతిరాజు, కుమార్‌, లక్ష్మణ్‌, ఎల్లగౌడ్‌, అశోక్‌, రఘువంశీ, రాజు, వెంకటరమణ, సంతోశ్‌, యాకయ్య, అనిల్‌, రవి, రాజు, ప్రదీప్‌ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలి

విద్యారణ్యపురి : క్రీడాపోటీల్లో గెలుపోటములను సాధారణంగా తీసుకుని, ఆత్మవిశ్వాసంతో క్రీడాకారులు ముందుకెళ్లాలని హనుమకొండ కేడీసీ ఎన్‌ఎస్‌ఎస్‌ పీఓ డాక్టర్‌ గంగిశెట్టి శ్రీనివాస్‌ కోరారు. క్రీడాకారులు రాణించడం ఎలా అనే అంశంపై హనుమకొండ వడ్డేపల్లిలోని ఎస్‌పీ క్రికెట్‌ అకాడమీలో ఆయన మాట్లాడారు. ఆటల్లో ఓటమి చెందినా మళ్లీ గెలుపు కోసం ప్రయత్నించాలన్నారు. సమావేశంలో క్రికెట్‌ అకాడమీ నిర్వాహకులు రాజ్‌కుమార్‌, రవి, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ‘మందే’ నైవేద్యంపై భిన్నాభిప్రాయాలు

గీసుకొండ : మండలంలోని కోటగండి కోట మైసమ్మ తల్లికి భక్తులు పూలు, పండ్లు, తాము పండిచిన పంటలతోపాటు పాటు మద్యంను నైవేద్యంగా సమర్పించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఆదివారం అమ్మవారి బోనాల సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి అమ్మవారికి మద్యం, కల్లు పోయడం పట్ల సోషల్‌ మీడియా, పలు చానళ్లలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కొండా మురళి బయోపిక్‌ ‘కొండా’ సినిమా షూటింగ్‌ సందర్భంగా ప్రముఖ దర్శకుడు రాంగోపాల్‌వర్మ నాస్తికుడైనప్పటికీ అమ్మవారికి మద్యం తాగించడంతో వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. దీనిపై విమర్శలు రావడంతో ఆయన క్షమాపణ చెప్పినట్లు చెబుతున్నారు. కోటమైసమ్మ తల్లి గ్రామ దేవత. గ్రామాన్ని దుష్టశక్తుల నుంచి రక్షించే శక్తి. స్థానికంగా ప్రజలు చాలా సంవత్సరాల నుంచి కోటమైసమ్మ తమ సమస్యలు, మొక్కులు తీర్చాలంటూ గొర్రెలు, మేకలు, కోళ్లను బలి ఇవ్వడంతో పాటు మద్యాన్ని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించడం ఆచారంగా వస్తోందని స్థానికులు చెబుతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్‌ రూరల్‌ :
9951602875 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్‌ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్‌ (S.R): 9502950309 (వర్ధన్నపేట)
పి.చంద్రశేఖర్‌ (A.C.O): 9963646944